క్లుప్తంగా

గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలి



జియాగూడ: గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని జాతీయ నమో మిషన్ వందే గోమాతరం చైర్మన్ పేరిక సురేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం 'కావ్ హగ్ డే'ను పురస్కరించుకుని జియాగూడ సమర్థ కామధేను గోశాలలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం గో రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత హిందూ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి కమలేష్ దాస్ మహారాజ్, రాష్ట్ర అధ్యక్షుడు ఆత్మారామ్ మహారాజ్, యోగి అతిదేశ్ వారానందస్వామి పాల్గొన్నారు.

దేవర కరుణాకర్‌కు నివాళి



గోల్కొండ: దేవర కరుణాకర్ నిష్కలంక ప్రజా నాయకుడని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ టి.అమర్‌సింగ్ అన్నారు. గుడిమల్కాపూర్‌లో మంగళవారం దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్‌సింగ్ మాట్లాడుతూ.. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తిగా దేవర కరుణాకర్ పేరు తెచ్చుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, సునీల్‌యాదవ్, దేవర వంశీ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

గోల్కొండ: చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని గోల్కొండ తెలుగు ఉన్నత ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వైఎన్.అనురాధాదేవి అన్నారు. పాఠశాల వార్షిక క్రీడోత్సవాల్లో గెలిచిన వారికి ఆమె మంగళవారం పాఠశాలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సునీల్‌కుమార్, ఎస్.సుబ్బారావు, ఎ.రాధాదేవి, హేమలత, ఇజ్రాయేల్, సంధ్యారాణి తదితరులు ఉన్నారు.

నియామకం

సుల్తాన్‌బజార్: అర్చక వెల్ఫేర్ బోర్డు సభ్యులుగా చిలకమర్రి శ్రవణ కుమారాచార్యులు, కాందూరి కృష్ణమాచారి, జక్కాపురం నారాయణస్వామిని నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉద్యోగ సంఘం తరపున కృష్ణమాచారి, శ్రవణ కుమారాచార్యులు సభ్యులుగా నియామకం కాగా ధూపదీప నైవేద్యం అర్చకుల తరపు నుంచి జక్కాపురం నారాయణస్వామిని సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడమే కాకుండా వారి సంక్షేమం కోసం తమపై బాధ్యతలు పెట్టిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కంప్యూటర్ల అందజేత



కంప్యూటర్లను అందజేస్తున్న ఆర్యవైశ్య భవన్ సభ్యులు

అబిడ్స్: బేగంబజార్‌లోని ఆంధ్ర సరస్వతి బాలికల పాఠశాలకు ఆర్యవైశ్య భవన్ సభ్యులు అండగా నిలిచారు. దాదాపు రూ.5 లక్షల విలువైన 15 కంప్యూటర్లను ఉచితంగా అందజేశారు. కన్య విద్యాసమితి అధ్యక్షుడు గుబ్బ నాగేందర్‌రావు, బేగంబజార్ వైశ్య భవన్ అధ్యక్షుడు హన్మంతరావులు మాట్లాడుతూ.. పాఠశాలకు అండగా ఉండి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంతో పేద పిల్లలు చదివే ఈ పాఠశాలకు స్కూల్ యూనిఫామ్స్, పుస్తకాలను కూడా దాతల సాయంతో ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థిని అరుణజ్యోతి, సముద్రాల శివకుమార్, రవి, సందీప్, గోపాల్, పద్మ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



గౌలిగూడ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో ఫైర్ సిబ్బంది మంగళవారం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయం ఆవరణలో ఎత్తైన భవనం తరలింపు డ్రిల్, మాక్ ఫైర్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 230 మంది బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు. - సాక్షి, సిటీబ్యూరో

వీర జవాన్లకు ఘన నివాళి

సుల్తాన్‌బజార్: పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం అబిడ్స్ సర్కిల్ వద్ద అమర వీర జవాన్లకు దీవస్ నిర్వహించారు. ఈ సందర్భంగా బజరంగ్ దళ్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ శివరాములు మాట్లాడుతూ.. అమర వీర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించడం ప్రతి ఒక్క భారతీయుడు ప్రథమ కర్తవ్యం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బజరంగ్‌దళ్ నగర కన్వీనర్ సాయం మహేష్‌యాదవ్, నగర సహ కన్వీనర్ జి.అఖిల్, రాష్ట్ర సురక్ష కన్వీనర్ జి.కైలాస్ పాల్గొని నివాళులర్పించారు.

అమర జవాన్లకు శ్రద్ధాంజలి

అబిడ్స్: పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ చైర్మన్ డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ శ్రద్ధాంజలి ఘటించారు. వనిత కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, రాజ్‌నారాయణ ముదిరాజ్ వీర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్‌నారాయణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ఆ దాడిలో 40 మంది వీర జవాన్లను భారతదేశం కోల్పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సౌత్ డైరెక్టర్ మనోజ్ జైన్, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ సుప్రియ, సౌజన్య, వెన్నెల, హర్షిత, జ్యోతిర్మయి, సూర్యవంశీ, భావన, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



శ్రద్ధాంజలి ఘటిస్తున్న మేధావుల ఫోరం చైర్మన్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తదితరులు



నివాళులర్పిస్తున్న బజరంగ్ దళ్, వీహెచ్‌పీ నాయకులు

వీర జవాన్ల త్యాగాలను మరువలేరు..

గౌలిపురా: పుల్వామా దాడుల్లో వీర మరణం పొందిన అమరవీరుల త్యాగాలను దేశ ప్రజలు ఎప్పటికీ మరువలేరని నాయకులు కొనియాడారు. సౌత్ జోన్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులతో సుధా థియేటర్ నుంచి లాల్‌దర్వాజా మోడ్ వద్ద ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర బజరంగ్ దళ్ సురక్షా ప్రముఖ్ కైలాష్, సిటీ కన్వీనర్ మహేశ్, కో కన్వీనర్ అఖిల్, సౌత్ జోన్ బజరంగ్ దళ్ కన్వీనర్ రాహుల్, సౌత్ జోన్ బజరంగ్ దళ్ కో కన్వీనర్ పవన్, సౌత్ జోన్ వీహెచ్‌పీ జాయింట్ సెక్రటరీ ముఖేశ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు సమాజ సేవ చేయాలి



బుక్స్ పంపిణీ చేస్తున్న డీసీపీ మధుకర్ స్వామి, కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

అబిడ్స్: సమాజ సేవకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని రాచకొండ డీసీపీ పరవస్తు మధుకర్ స్వామి పేర్కొన్నారు. సీతారామ్‌బాగ్‌లోని ఈశ్వర్ చంద్ర హెల్త్ సెంటర్‌లో పరవస్తు క్రియేటీవ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్స్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఉచితంగా బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ పరవస్తు మధుకర్ స్వామి మాట్లాడుతూ.. సమాజ సేవ చేయడంలోనే మనిషికి ఎంతో తృప్తిగా ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ జీవితంలో కొంత మేరకైన సమాజ సేవ చేయాలని సూచించారు. కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. సామాజిక కార్యక్రమాలు చేపట్టినప్పుడే సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. సమాజ అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాభూషన్, డాక్టర్ లక్ష్మీకుమారి, డాక్టర్ గులాబ్ రాణి, డాక్టర్ సరస్వతి, ప్రొఫెసర్ రాజ్‌కుమార్, రామిరెడ్డి, సుమతి, ప్రవీణ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అధికారులు సకాలంలో పనులు పూర్తి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన బల్దియా, జలమండలి అధికారులతో కలిసి టోలీచౌకి పరిసరాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండీలైన్స్, హకీంపేట్, టోలీచౌకి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ, వరదనీటి పైప్ లైన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రంజాన్ మాసం వచ్చే నెలలోనే ప్రారంభం అవుతుందని, దానికంటే ముందే పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు. ప్రజా ధనం వెచ్చించి చేస్తున్న పనులు సకాలంలో పూర్తి చేస్తేనే ప్రజలకు ఇబ్బందులు ఉండవన్నారు.

ఉత్సాహంగా '2కె రన్ ఫర్ హెల్త్'



2కె రన్ ఫర్ హెల్త్‌లో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు

గౌలిపురా: ఆరోగ్యమే మహా భాగ్యమని మిట్ట ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాస్ మిట్ట, డాక్టర్ స్వాతంత్ర మిట్ట అన్నారు. మంగళవారం సరస్వత అకాడమీ హైస్కూల్, మిట్ట ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో 2కె రన్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు గౌలిపురా నుంచి ఛత్రినాక వరకు ఈ రన్‌లో పాల్గొన్నారు. అనంతరం పుల్వామా దాడిలో మరణించిన అమర జవాన్లకు నివాళులర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యం, క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వత అకాడమీ (ట్రస్టు) హైస్కూల్ చైర్మన్ ఓం ప్రకాశ్, అధ్యక్షులు మనోహర్ మిట్ట, కార్యదర్శి దుర్గేశ్ లింగం గౌడ్, సంయుక్త కార్యదర్శి రమేశ్, కోశాధికారి ప్రకాశ్ రాజ్, కార్యవర్గ సభ్యులు జానకీరామ్, ఎం.సుధాకర్, ప్రధానోపాధ్యాయురాలు ఆర్.దీప్తిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల సమావేశం



సమావేశంలో రాథోడ్, ఆనంద్‌కుమార్‌గౌడ్, మమతా గుప్తా తదితరులు

అబిడ్స్: సీఎం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం సమావేశమయ్యారు. రాజధాని హోటల్‌లో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్, మమతాగుప్తా, సంతోష్ గుప్తా, ఆలపురుషోత్తమ్ రావు, పరమేశ్వరీ సింగ్, ముఖేష్ సింగ్, ప్రియాగుప్తా, రాంచందర్‌రాజ్, శంకర్‌లాల్ యాదవ్, ఉద్యమ నాయకుడు ఆర్‌వీ.మహేందర్ కుమార్‌తో పాటు పలువురు నేతలు సమావేశమై కేసీఆర్ జన్మదిన వేడుకలపై చర్చించారు.

'ప్రభుత్వ పాఠశాలలో కొత్త పోలీస్‌స్టేషన్ వద్దు'

గోల్కొండ: కొత్త పోలీస్‌స్టేషన్ల కోసం భవనాల పరిశీలన వివాదాస్పదంగా మారుతుంది. టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌ను విడదీసి గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు అధికారులు రెండు రోజుల క్రితం గుడిమల్కాపూర్‌లోని కూరగాయల కార్యాలయాన్ని పరిశీలించారు. అయితే రైతులు, వ్యాపారులు మాత్రం మార్కెటింగ్ భవనం అసలే చిన్నదిగా ఉందని భావి అవసరాల కోసం ఇది ఏమాత్రం సరిపోదని, ఇటువంటి భవనంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే బాగుండదని తన నిరసనలో వ్యక్తం చేశారు. అదేవిధంగా టోలీచౌకి పోలీస్‌స్టేషన్ భవనం కోసం కార్వాన్ ఎమ్మెల్యేతో పాటు పోలీసు అధికారులు టోలీచౌకి పరిసరాల్లో భవనాలను పరిశీలించారు. ఇందులో భాగంగానే వారు టోలీచౌకి చౌరస్తా వద్ద గల ప్రభుత్వ పాఠశాల భవనాన్ని కూడా పరిశీలించారు. అయితే అతి పురాతన ప్రభుత్వ పాఠశాలలో పోలీస్‌స్టేషన్ భవనం ఏర్పాటును పూర్వ విద్యార్థులతో పాటు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారు.

'చిరు వ్యాపారులను వేధించొద్దు'

డబీర్‌పురా: పొట్టకూటి కోసం చిరు వ్యాపారాలు చేసుకునే వారిని ట్రాఫిక్ పోలీసులు చలాన్ల పేరుతో వేధించొద్దని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ అన్నారు. మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీసులు చిరు వ్యాపారులను ట్రాఫిక్ చలాన్ల పేరుతో వేధిస్తుండటాన్ని స్థానిక వ్యాపారులు ఎమ్మెల్యే పాషా ఖాద్రీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే పాషా ఖాద్రీ చిరు వ్యాపారులతో కలిసి సోమవారం రాత్రి మీర్‌చౌక్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ పోలీసులు చలాన్ల పేరుతో చిరు వ్యాపారులను వేధించడం సరైంది కాదన్నారు. అనంతరం ట్రాఫిక్ పోలీసులు సర్ది చెప్పడంతో నిరసన విరమించుకున్నారు.

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణం

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని స్వయంభూ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం నేత్ర పర్వంగా కొనసాగింది. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి తిరు కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆనవాయితీలో భాగంగా చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ కె.ఎస్.ప్రసాద్ వర్మ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బ్యాండ్ మేళాలను వాయించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి 8 గంటలకు స్వామి వారి వాహన ఊరేగింపు నిర్వహించారు. ఈఓ శివ రుద్రప్ప, అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యులు, పాలక మండలి సభ్యులు జుర్కీ సంతోషిరాణి, పి. శ్రీనివాస్ గౌడ్, ఉమా రాణి, డి.రవి, పి.చంద్రశేఖర్, మీనాక్షి, అర్చనల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కల్యాణ మహోత్సవంలో చార్మినార్ ఏసీపీ రుద్ర భాస్కర్, విద్యాశాఖ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పుస్తె శ్రీకాంత్, జుర్కి రాజేందర్, బి.వెంకటేష్ ముదిరాజ్, గ్యార ప్రభాకర్, అనిల్‌కుమార్, ప్రభాకర్ రా జు, రామకృష్ణ, గడ్డం సత్యనారాయణ పాల్గొన్నారు.



చెన్నకేశవ స్వామి కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

ఉస్మానియాలో 'జూడా'లు, టెక్నీషియన్ల ఆందోళన

పోలీసుల తీరుపై నిరసన

అఫ్జల్‌గంజ్: దొంగతనం చేయకుండానే చేసినట్లు ఒప్పుకోవాలంటూ డయాలసిస్ టెక్నీషియన్‌పై విచక్షణా రహితంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపిస్తూ ఉస్మానియా ఆసుపత్రి టెక్నీషియన్లు, జూనియర్ డాక్టర్లు ఆందోళన చేపట్టారు. జూనియర్ వైద్యుల సంఘం ఉస్మానియా శాఖ అధ్యక్షుడు డాక్టర్ శ్రీకాంత్ నేతృత్వంలో మంగళవారం ఉస్మానియా ఆసుపత్రి ఓపీ భవనం ఎదుట జూడాలు, టెక్నీషియన్లు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, ఆర్‌ఎంఓ డాక్టర్ శేషాద్రిలకు పోలీసుల తీరుపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ...... అఫ్జల్‌గంజ్ పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రిలోని నెఫ్రాలజీ విభాగంలో డయాలసిస్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఎల్లేష్ అనే యువకుడిని కాళ్లు, చేతులు కట్టివేసి అమానుషంగా చితకబాదడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అఫ్జల్‌గంజ్ ఎస్‌ఐ రామ్‌కిషన్ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ వైద్య సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ఎల్లేష్‌ను సాధారణ విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు రమ్మని పిలిచి నువ్వే దొంగతనం చేశావు, లేదంటే ఎవరు చేశారో చెప్పాలంటూ విచక్షణారహితంగా చితకబాదడంతో అతడు నడవలేని స్థితికి చేరుకున్నాడన్నారు. టెక్నీషియన్ ఎల్లేష్‌ను చితకబాదిన పోలీసులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎల్లేష్ మాట్లాడుతూ.... అఫ్జల్‌గంజ్ పోలీసులు తనకు ఫోన్‌చేసి పోలీస్‌స్టేషన్‌కు రమ్మని పిలవడంతో సాయంత్రం 6 గంటలకు తానాకు వెళ్లానని తెలిపారు. డయాలసిస్ కోసం వచ్చిన ఓ మహిళా రోగి మంగళసూత్రం చోరీకి గురైందని, అది నువ్వే తీశావని ఒప్పుకోవాలని, లేకుంటే ఎవరు తీశారో చెప్పాలని తీవ్ర ఒత్తిడి చేశారని తెలిపారు. అనంతరం కాళ్లు, చేతులు కట్టివేసి మోకాళ్ల, అరికాళ్లపై తీవ్రంగా కొట్టారని వాపోయారు. తమకు న్యాయం చేయాలని పోలీసులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కాగా ఈ విషయంలో అఫ్జల్‌గంజ్ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని, అరెస్టు విషయంపై ముందస్తుగా ఆసుపత్రి వైద్యాధికారులకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ ఆరోపించారు. మరోవైపు అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి మాత్రం రోగి ఫిర్యాదు మేరకు మంగళసూత్రం చోరీ విషయంలో డయాలసిస్ టెక్నీషియన్‌ను విచారణ కోసం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ చేసి పంపించామని తెలిపారు. ఎల్లేష్‌ను పోలీసులు కొట్టారని చెప్పడం పూర్తి అవాస్తవమని, నిరాధారమైనది ఆయన అన్నారు.

మల్కం క్రీడలో శ్లోకా స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ నాగేశ్వర్

జియాగూడ: మల్కం క్రీడలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో జాతీయ స్థాయిలో నిర్వహించిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ప్రతిభ చాటారని శాంతినగర్ శ్లోకా స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం స్కూల్ ఆట స్థలంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం క్రీడా యువజన శాఖ నిర్వహించిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో మధ్యప్రదేశ్‌లో జరిగిన మల్కం క్రీడలో తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున జియాగూడ శ్లోకా స్కూల్ విద్యార్థులు ఆడి గెలుపొందినందుకు వారిని సన్మానించారు. స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ అమిత చరణ్, మల్కం క్రీడ శిక్షకుడు సుఖ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో రోడ్ల విస్తరణకు రూ.150 కోట్లు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధిపై తాను అసెంబ్లీలో లేవనెత్తిన అంశాలకు ఆయా శాఖల మంత్రులు స్పందించి నిధులు కేటాయిస్తామన్నారని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. అసెంబ్లీలో కార్వాన్ సమస్యలపై ప్రశ్నలు వేసినందుకు పలువురు మజ్లిస్ నాయకులు మంగళవారం ఆయనను టోలీచౌకిలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి రోడ్ల విస్తరణకు రూ.150 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అదేవిధంగా గోల్కొండ ఏరియా ఆస్పత్రికి నూతన భవన నిర్మాణానికి రూ.4 కోట్లు మంత్రి హరీష్‌రావు మంజూరు చేశారన్నారు. బుల్కాపూర్ నాలా విస్తరణపై మంత్రి కేటీఆర్ స్పందించి నాలా మళ్లింపు విస్తరణకు రూ.8 కోట్లు మంజూరు చేశారన్నారు. గోల్కొండలోని చారిత్రక కట్టడాలను సుందరీకరించడం జరుగుతుందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తనకు హామీ ఇచ్చారన్నారు. కార్వాన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుతో పాటు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కూడా నిధులు ఇస్తామని ఆ శాఖ మంత్రి తనకు హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సాప్ మెడికల్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్, కార్పొరేటర్ నసిరుద్దీన్, బజర్‌ఉద్దీన్, హారూన్ ఫర్హాన్, సయ్యద్ జబ్బార్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యేతో ట్రాఫిక్ ఏసీపీ సమావేశం

చార్మినార్: దక్షిణ మండలం ట్రాఫిక్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రావు మంగళవారం చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్‌ఖాన్‌తో సమావేశమయ్యారు. ముందుగా మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేకు బొకే అందజేసి ఏసీపీ శ్రీనివాస్‌రావు కొద్దిసేపు పాతబస్తీలో ట్రాఫిక్ విషయంపై చర్చించారు. దక్షిణ మండలంలోని చార్మినార్, బహదూర్‌పురా, మీర్‌చౌక్, ఫలక్‌నుమా తదితర నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎక్కడైనా ఎప్పుడైనా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో బహదూర్‌పురా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సునిల్ కూడా అన్నారు.



ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో జరిగిన సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావు

సమాజ మార్పునకు దోహదపడే రచనలు చేయాలి



పురస్కార గ్రహీతలతో జనార్దన్‌రెడ్డి, చిత్రంలో ఆచార్య తంగెడ కిషన్ రావు

నాంపల్లి: సాహితీవేత్తలు పురస్కారాలను ఆశించకుండా సమాజ మార్పునకు దోహదపడే రచనలను చేయాలని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో తెలుగు వర్సిటీ విస్తరణల సేవా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాహితీ పురస్కారాలు–2020 ప్రదానోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో పురస్కారం పొందిన 11 మంది సాహితీమూర్తులను రూ. 20,116 నగదు పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు. విశిష్టఅతిథిగా హాజరైన రాష్ట్ర ఆడిట్ సంచాలకులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సాహిత్యం మానవ జీవితంతో ముడిపడి ఉందని అది జీవన గమనానికి దిక్సూచి అన్నారు. సభకు అధ్యక్షత వహించిన తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు మాట్లాడుతూ.. తెలుగు విశ్వవిద్యాలయం రూపకర్త డాక్టర్ నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలను త్వరలో నిర్వహిస్తామని చెప్పారు. విస్తరణల సేవా విభాగం ఇన్‌చార్జి రింగు రామ్మూర్తి వందన సమర్పణ చేశారు.

పురస్కార గ్రహీతలు వీరే..

పద్యకవితలో కుంతీపురం కౌండిన్య తిలక్, వచన కవితలో అఫ్సర్, గేయ కవిత్వంలో వడ్డె ముద్దంగుల ఎల్లన్న, బాల సాహిత్యంలో పుప్పాల కృష్ణమూర్తి, కథా ప్రక్రియలో జి.వెంకటకృష్ణ, నవలా ప్రక్రియలో నేరెళ్ళ శ్రీనివాస్‌గౌడ్, సాహిత్య విమర్శలో సంగిశెట్టి శ్రీనివాస్, నాటక ప్రక్రియలో అద్దేపల్లి భరత్‌కుమార్, అనువాదంలో ఎం.అయోధ్యారెడ్డి, వచన రచనలో డాక్టర్ పి.భాస్కర యోగి, రచయిత్రి ఉత్తమ గ్రంథం ప్రక్రియలో మందారపు హైమావతి ఉన్నారు. అయితే వచన కవితా ప్రక్రియలో అఫ్సర్‌కు బదులుగా రెంటాల జయదేవ్ పురస్కారాన్ని అందుకున్నారు.

శ్రీ చైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నాంపల్లి: ఫిర్జాదిగూడ శ్రీ చైతన్య కళాశాల విద్యార్థిని రమాదేవి ఆత్మహత్యకు కారణమైన శ్రీ చైతన్య జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, ఆజాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ఇంటర్ బోర్డు కార్యాలయంలో ప్రాంతీయ సంచాలకురాలు జయప్రదకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రామకృష్ణ, ఆజాద్ మాట్లాడుతూ.. శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం పెడుతున్న మానసిక ఒత్తిడిని తట్టుకోలేక రమాదేవి ఆత్మహత్య చేసుకుందన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాయికుమార్, రాష్ట్ర నాయకురాలు పవిత్ర తదితరులు పాల్గొన్నారు.



ప్రాంతీయ సంచాలకురాలు జయప్రదకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

గౌలిపురా: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని మంగళవారం మొఘల్‌పురా పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మొఘల్‌పురా షుకూర్ మసీదు ప్రాంతానికి చెందిన అబ్దుల్ జాఫర్ (33), రాజేంద్రనగర్ అత్తాపూర్‌కు చెందిన డ్రైవర్ అబ్దుల్ ఖదీర్ (35) మొఘల్‌పురా షుకూర్ మసీదు పరిసర ప్రాంతాల్లో ప్రజల వద్ద నుంచి సేకరించిన 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న మొఘల్‌పురా పోలీసులు దాడులు నిర్వహించి అబ్దుల్ జాఫర్, అబ్దుల్ ఖదీర్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 32 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. ఈ దాడుల్లో మొఘల్‌పురా ఏఎస్సై మహ్మద్ మక్బూల్, పీసీలు రాఘవేంద్ర, రాజేశ్, సిబ్బంది, సివిల్ సప్లయ్ అధికారులు మహ్మద్ అంజద్, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో పాటు నిందితులు

రౌడీషీటర్ హత్య కేసులో నలుగురి రిమాండ్

చాంద్రాయణగుట్ట: రౌడీషీటర్ హత్య కేసులో నలుగురు నిందితులను ఫలక్‌నుమా పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. ఫలక్‌నుమా ఏసీపీ షేక్ జహంగీర్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. కాలాపత్తర్‌కు చెందిన డ్రైవర్ మహ్మద్ అయాజ్ అలియాస్ అబ్బు(28) 2015లో మహ్మద్ అలీని హత్యచేసి జైలు జీవితం గడిపాడు. అప్పటి నుంచి కాలాపత్తర్‌లో రౌడీషీట్ కూడా కొనసాగుతుంది. అయాజ్ ఆరు నెలల క్రితం సంజయ్‌గాంధీనగర్‌లో నివాసం ఉండే అప్పటి మృతుడు మహ్మద్ అలీ బంధువుల ఇంటి సమీపంలో అద్దెకు దిగాడు. పాత హత్య విషయమై నాలుగు నెలల క్రితం మహ్మద్ అలీ వదిన షాకీరా, ఆమె కుమారుడు మహ్మద్ ఆసిఫ్(22)తో ఘర్షణ చోటుచేసుకొని చంపుతానంటూ బెదిరించాడు. ఇతనితో ఎప్పటికైనా ముప్పుంటుందని భావించిన షాకీరా తన కుమారుడిని ప్రోత్సహించి అయాజ్‌ను చంపేయమంది. దీంతో ఆసిఫ్ ఈ నెల 6న రాత్రి తన స్నేహితులు షేక్ ఖాలెద్(26), మహ్మద్ అఫ్రోజ్ ఖాన్(21), మహ్మద్ నదీం ఖురేషీ(24)లతో కలసి కత్తులతో దాడి చేసి అయాజ్‌ను దారుణంగా హత్య చేసి పరారయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహకారంతో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. షాకీరా బేగం పరారీలో ఉంది. ఈ సమావేశంలో ఫలక్‌నుమా అదనపు ఇన్‌స్పెక్టర్ అశోక్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఫలక్‌నుమా ఏసీపీ షేక్ జహంగీర్